ప్రజాశక్తి
గురువారం 18 ఏప్రిల్ 2024 1
అనంతపురం శ్రీ సత్యసాయి





నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ షురూ..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ కూడా గురువారం విడుదల కానుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉండనుంది. పార్లమెంట్ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ఆయా జిల్లా కేంద్రాల్లో ఉండగా, అసెంబ్లీకి ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఉండనుంది. ఈ మేరకు రాజకీయ పార్టీలు నామినేషన్ల దాఖలుకు సమయత్తం అవుతున్నాయి. నేడు గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఏప్రిల్ 26వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అనంతరం ఏప్రిల్ 29వ తేదీతో ఉపసంహరణల గడువు ముగియనుంది. మే 13న ఎన్నికలు, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. అనంతపురం పార్లమెంటుకు సంబంధించి అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నారు. సత్యసాయి జిల్లాలో సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- పార్లమెంటు నియోజకవర్గాలకు జిల్లా కేంద్రాల్లో
- అసెంబ్లీకి నియోజకవవర్గ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ

పుట్టపర్తిలో హిందూపురం పార్లమెంటుకు నామినేషన్లు స్వీకరిస్తారు. రాయదుర్గంకు కరుణకుమారి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించనున్నారు. ఉరవకొండకు జాయింట్ కలెక్టరు కేతన్ గార్గ్, గుంతకల్లుకు శ్రీనివాసులరెడ్డి, తాడిపత్రికి రాంభూపాల్‌రెడ్డి, శింగనమలకు వెన్నెల శ్రీను, అనంతపురానికి ఆర్డీవో గ్రంథి వెంకటేశ్, కళ్యాణదుర్గంకు ఆర్డీవో సుస్మిత రాణి, రాప్తాడుకు వసంతబాబు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి భాగ్యరేఖ, కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వంశీకృష్ణారెడ్డి, పెనుకొండ నియోజకవర్గానికి సబ్ కలెక్టరు అపూర్వ భరత్, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి వెంకట సాయిరామిరెడ్డి, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి గౌరిశంకర్ లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారు. మిగతా 3లో

ఊపందుకోనున్న ఎన్నికల హడావుడి

తొలి ఘట్టానికి సమయం ఆసన్నమవడంతో ఎన్నికల సందడి మరింత ఊపందుకోనుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడి ఇప్పటికే నెల రోజులు దాటిపోయింది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు అవసరమైన ఏర్పాట్లు ఇది వరకే చేసుకుని ఉన్నారు. తొలి రోజు నుంచే ఎన్నికల హడావుడి ఊపందుకోనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటన్నింటిలోనూ నేటి నుంచి నామినేషన్లు స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.



నామినేషన్ల స్వీకరణకు సంబంధించి కళ్యాణదుర్గంలో అధికారులతో సమీక్షిస్తున్న కళ్యాణదుర్గం ఆర్వో రాణి సుస్మిత

ముహూర్తాలు చూసుకుని..

నామినేషన్ల వేసే సమయం రావడంతో అభ్యర్థులు అ పనుల్లో బిజీ అయ్యారు. ముఖ్యంగా అభ్యర్థులు మంచి సమయం, మహూర్తాలు చూసుకుని నామినేషన్లు వేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో అభ్యర్థులు పండితుల వద్దకు వెళ్లి వారి పేరు బలాలతో ఏ రోజు నామినేషన్ వేస్తే మంచి జరుగుతుందో అని తెలుసుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది నామినేషన్ ఎప్పుడు వేయాలన్న తేదీలను నిర్ణయించుకున్నారు. అన్ని నియోజకవర్గాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో వారంతా నామినేషన్ పత్రాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. డమ్మీ పత్రాలు ఒక సారి దాఖలు చేసి మళ్లీ కార్యకర్తల కోలాహలం నడుమ మరో సెట్ నామినేసన్ దాఖలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.



ఎన్నికల పరిశీలకుడు నితిన్ అగర్వాల్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

అనంతకు ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల పరిశీలకులు అనంతపురానికి గురువారం విచ్చేశారు. అనంతపురం జిల్లా పరిధిలోని రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్ బుధవారం మధ్యాహ్నం అనంతపురం చేరుకున్నారు. నగరంలోని పోలీస్ అతిథి గృహంలో ఉన్న ఆయన్ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ ఎస్పీ అమిత్ బర్దర్‌లు కలిసి పుష్పగుచ్చం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో ఎన్నికల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూముల వద్ద

పటిష్ట భద్రత

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఈవీఎం స్ట్రాంగ్ రూముల భద్రత పటిష్టంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులకు సూచించారు. బుధవారం నాడు కదిరి అసెంబ్లీ నియోజకవర్గం, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి కదిరి పట్టణంలోని బాలుర పాఠశాలలో మిగతా 3లో

అనంత, నార్పలలో
నగదు స్వాధీనం
వార్త 3లో

ఉద్దండుల నేల..
శింగనమల..!
వార్త 4లో

ఇండియా వేదిక అభ్యర్థికి మద్దతుగా
సిపిఎం ప్రచారం
వార్త 8లో

లీజు పేరుతో రైతులకు టోకరా..!

ప్రజాశక్తి-బత్తలపల్లి

రైతుల వద్ద ఉన్న ట్రాక్టర్లను లీజు పేరుతో తీసుకుని వాటిని ఇతరులకు అమ్మేశారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 57 ట్రాక్టర్లను ఇలా అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. నిందితులందరూ ఓ ముఠాగా ఏర్పడి ట్రాక్టర్ల అమ్మివేత కార్యక్రమాన్ని కొనసాగించారు. ట్రాక్టర్ల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకున్నారు. ఈ ఘటనపై రైతుల నుంచి ఫిర్యాదు అందడంతో ఈ లీజు బాగోతం వాస్తవాలు బయటకు వచ్చాయి. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేక పోలీసు బందాలను ఏర్పాటు చేసి తక్కువ సమయంలోనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.56 కోట్లు విలువజేసే 57 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి.మాధవ్ రెడ్డి ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ సిఐ హేమంత్ కుమార్‌తో కలిసి బుధవారం నాడు తాడిమర్రి పోలీసు స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చూపిస్తూ నిందితుల వివరాలను వెల్లడిస్తున్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్లజంగరి రవికుమార్, కడప జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన లోమడ బయారెడ్డిలు తాడిమర్రి, కణేకల్ మండలానికి చెందిన రైతుల నుంచి ట్రాక్టర్లను లీజుకు తీసుకున్నారు. తీసుకున్న ట్రాక్టర్లను పులివెందుల పరిసర

- రైతుల నుంచి ట్రాక్టర్లు తీసుకుని అమ్మేసిన వైనం
- జల్సాల కోసం రైతులకు కుచ్చుటోపీ
- బాధితుల ఫిర్యాదుతో ముగ్గురు నిందితులు అరెస్ట్
- రూ.4.56కోట్లు విలువజేసే 57 ట్రాక్టర్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

ప్రాంతాల్లో అమ్మేశారు. రైతులకు అనుమానం రాకుండా మూడు నెలల పాటు నెలకు రూ.25వేల ప్రకారం ఇచ్చారు. ఆ తరువాత రైతులకు కనబడకుండా తప్పించుకుని తిరిగారు. ప్రధాన నిందితులు రవికుమార్, బయారెడ్డిలు కాకర్ల హాజీపీరా, బోగిరెడ్డి చంద్ర ఓబులరెడ్డి, పెసల నాగమల్లారెడ్డి, తలారి రామలింగేశ్వరరావు, చిన్న జయచంద్ర రెడ్డి, మిగతా 3లో

కరువు సీమలో అనంత 'తేజం'

తొలి ఏడాదిలోనే ఇంటర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి-అనంతపురం

పరీక్ష ఏదైనా ఫలితాల్లో ఎల్లప్పుడూ నెంబర్ వన్‌గా తేజ గ్రూప్ విద్యాసంస్థలు నిలుస్తున్నాయని తేజస్విరెడ్డి తెలిపారు. కరువు సీమలో విద్య కుసుమాలను వికసింపజేయడమే లక్ష్యంగా లాభాపేక్ష లేకుండా పేద రైతులకు అండగా నిలబడేందుకు తేజ జూనియర్ కళాశాలను స్థాపించినట్లు ఆయన తెలిపారు. తేజ గ్రూపు లక్ష్యం, ఉద్దేశం ఒకే సంవత్సరంలో నిరూపితమైందన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి విభాగాల్లో ఎపిఈ ఎంసెట్, ఐఐటి, జెఈఈ, నీట్, సిపిటి క్లాట్ కాంపిటీటివ్ పరీక్షలకు నిష్ణాతులైన అధ్యాపకులచే ఉత్తమ విద్యాబోధన అందిస్తూ పోటీ పరీక్షలకు సమాయత్తం చేయిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార సంబంధం కాకుండా అపార అనుభవం ఉన్న అధ్యాపకుల పర్యవేక్షణలో సుదీర్ఘమైన కళాశాల ప్రాంగణం, అత్యాధునికమైన టెక్నాలజీ, ల్యాబ్, స్పోర్ట్స్, అన్ని రకాల రంగులతో తేజ జూనియర్ కళాశాలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తేజ అకాడమీ ద్వారా ఇప్పటివరకు ఎంసెట్‌లో 450 మందికి పైగా, నీట్‌లో వంద మందికి పైగా, జెఈఈలో 65 మందికి పైగా, కె సెట్‌లో 20 మందికి పైగా, ఎల్‌పియులో 18, ఐఐటిలో 23 మంది ఫలితాలను సాధించి తేజ గ్రూపు ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేశామని తెలిపారు.

2024 ఇంటర్ ఫలితాల్లో తేజ ప్రభంజనం..

ఇంటర్ ఫలితాల్లో టాప్ ర్యాంకులు కైవసం చేసుకొని రాష్ట్రస్థాయిలో అనంత ఖ్యాతిని నిలబెట్టారు. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం తేజేశ్వర్‌రెడ్డి, ఉమాదేవి మాట్లాడుతూ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే తేజ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సష్టించారన్నారు. ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో టాప్ ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. బైపిసిలో రమ్యశ్రీ 436/440 99 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిందన్నారు. ఫాతిమా సుమయ్య 435, మానస 435 మార్కులు సాధించారు. ఎంపిసిలో శృతి 464/470 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవగా, హాసిని 462, నవనీత్‌కృష్ణ 462 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఉమాదేవి, సిఇఒ అనిల్‌కుమార్, డీన్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపళ్లు సాయిచైతన్య, నేత్ర వాణి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



విజయ సంకేతం చూపుతున్న తేజ గ్రూప్ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు



సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రమేష్

'సర్వేపల్లి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

సర్వేపల్లి రాధాకృష్ణ నేటి తరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆదర్శప్రాయుడని రాష్ట్ర సాహితీ అకాడమీ అవార్డు గ్రహీత, డాక్టర్ పతికి రమేష్ నారాయణ పేర్కొన్నారు. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉన్న సర్వేపల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. రమేష్ నారాయణ మాట్లాడుతూ దేశానికి గురువు ఔన్నత్యాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి అన్నారు. ఆయన ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకునిగా సేవలందించడం జిల్లా వాసులు చేసుకున్న అదృష్టం అన్నారు. ఓ గురువు రాష్ట్రపతిగా అత్యున్నత స్థాయిని అందుకోవడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, కార్యదర్శి ఎస్.మంజుల, జి.నందిత, సొసైటీ సభ్యులు ఎం.ముత్యాలమ్మ, కురుబ ధోని, దివ్యతేజ, జయకృష్ణ, సామాజిక సేవకుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వైపి.బాబు పేర్కొన్నారు. వైపి.బాబు ఆధ్వర్యంలో బుధవారం పట్టణం లోని కోళ్ల ఫారం ప్రాంతంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. వైసిపి అన్ని వర్గాల అభివృద్ధి కోసం పని చేసిందన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చిందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డి, ఎంపిగా శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన జగన్‌ను మరోమారు సిఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు బిషప్ వై.వాసు అనిల్ కాంత్, అబ్రహమయ్య, సాల్మన్‌రాజ్, జాకోబ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అమ్మ సంస్థ చేయూత

ప్రజాశక్తి-అనంతపురం

కష్టాల కడలిలో కూరుకుపోయి జీవనం భారమైన ఓ కుటుంబానికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. వివరాలు.. నగరంలోని గుత్తి రోడ్డులో నివసిస్తున్న నాయీబ్రాహ్మణుడు వీరన్న వృత్తి పని చేస్తూ అతడి భార్య నాగరత్నమ్మ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవారు. వీరికి శ్రావణి అనే కూతురు ఉంది. ఆమె ప్రస్తుతం బి.ఇడి చదువుతోంది. వీరన్న పక్షవాతంతో రెండేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. నాగరత్నమ్మ తన కూలి డబ్బులతోనే భర్తకు వైద్యం చేయిస్తూ కూతురిని చదివించేది. అయితే ఆమె గత జనవరిలో పనికి వెళ్లగా గడ్డి కోసే యంత్రంలో పడి ప్రమాదవశాత్తూ ఎడమ చేయి కోల్పోయింది. ఈ విషయం తెలియడంతో అమ్మ ట్రస్టు అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి బుధవారం వారి ఇంటికి వెళ్లి నాగరత్నమ్మకు రూ. 40వేల విలువ చేసే కృత్రిమ చేయిని అమర్చి, శ్రావణి చదువు, ఇంటి పోషణకు రూ. 40వేలు, నిత్యావసర సరుకులకు రూ. 20వేలను సంస్థ తరఫున అందజేశారు. భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.



నాగరత్నమ్మకు కృత్రిమ చేయి అందజేసిన రమణారెడ్డి

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రెవెన్యూ కాలనీలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సీతా రాముల విగ్రహాలను వివిధ రకాల పూలతో అలంకరించి వేకువజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో జిల్లా మొబైల్ కోర్ట్ న్యాయధిపతి శివశంకర్ దంపతులు, డిప్యూటీ రవాణా కమిషనర్ ఎం.వీరరాజు దంపతులు, నిర్మల, ఆలయ కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి సి.కృష్ణమూర్తి, సభ్యులు వెన్నెల కృష్ణ, గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీరామ సహిత హనుమద్ వాహనంతో రెవెన్యూ కాలనీ, షిర్డీ నగర్ విధుల్లో ఊరేగించారు. అనంతరం 600 మందికి అన్నదానం చేశారు.

గుత్తి : శ్రీరామనవమి సందర్భంగా బుధవారం మం డల వ్యాప్తంగా రామాలయాలు, ఆంజనేయస్వామి, తదితర ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వ హించారు. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో వేద పండితులు మాంగళ్య ధారణ చేసి తలంబ్రాలు పోసి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీరామ చంద్రుని తరఫున రామాంజులమ్మ, గురుపాదస్వామి దంపతులు, సీతమ్మ తరఫున రాజ్యలక్ష్మి, జి.నరసారెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవం తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహా మంగళహారతి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కోట ప్రాంతంలో ఉన్న రామాలయంలో కమిటీ ఆధ్వర్యంలో కల్యాణో త్సవం నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, డి.షఫీ, కౌన్సిలర్ మాతంగి అంజలి, సునీల్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు ఎన్.శివప్రసాద్, ఎన్.రవికుమార్, ఎంకె.చౌదరి, దాసా రమేష్, చక్రపాణి, శేషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : శ్రీరామనవమి సందర్భంగా రాయదుర్గం కొండపై వెలసిన పట్టాభి సీతారామ స్వామి ఆలయం లో కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోటలో ఉన్న నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. కోదండ రామాలయం, ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయం, బయలు ఆంజనేయ స్వామి, తదితర ఆలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, కుటుంబ సభ్యులు కోదండ రామాలయంలో భక్తులకు పానకం పంపిణీ చేశారు.

బెళుగుప్ప : మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నక్కలపల్లిలో వెలసిన రాములయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరవగా తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో సీతా రాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సీతారాముల చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో కొలువుదీర్చి భజనలు చేస్తూ వీధుల గుండా ఊరేగించారు. రాత్రికి భజన ఏర్పాటు చేశారు.

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం సీతారాముల కల్యాణం మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా స్వామివార్లను ప్రత్యే కంగా అలంకరించి పూజలు చేశారు. బొమ్మనహాల్, ఉద్దేహాల్, ఎల్‌బి నగర్, గోవిందవాడ, దర్గా హొన్నూరు, తదితర గ్రామాల్లో కొందరు షష్టిపూర్తి వివాహాలు చేసుకున్నారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పుట్లూరు : శ్రీరామనవమి పురస్కరించుకొని మండలంలోని పుట్లూరు, తక్కలపల్లి, గూడూరు, కడవకల్లు, తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదా లతో పాటు పానకం అందించారు. గ్రామ వీధుల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

పెద్దవడుగూరు : మండలంలోని కొట్టాలపల్లి, కోటకొండ, కాశేపల్లి, క్రిష్టిమేడిమాకులపల్లి, దిమ్మగుడి, రాంపురం, తదితర గ్రామాల్లో వెలసిన రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం ఘనం గా నిర్వహించారు. పెద్దవడుగూరు పేట రామాలయం వీధిలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

శింగనమల : గార్లదిన్నె మండలంలోని కల్లూరు, అగ్రహారం, జంబులదిన్నె, మర్తాడు గ్రామాల్లోని రామాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదమంత్రాల మధ్య సీతారాముల కల్యాణంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు ఆలయాల వద్ద వడపప్పు, బెల్లం పానకం పంచి పెట్టారు.


వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పొలికి గ్రామంలోని సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరవకొండ పార్క్ ఆంజనేయస్వామి, ఇందిరానగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణాన్ని వీక్షించారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సన్మానించారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రేకులకుంట గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రా రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు కాపు రామచంద్రారెడ్డిని శాలువాతో సన్మానించారు.

నార్పల : మండలంలోని పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచి స్వాతిలత దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. దూల్‌పేటలో కాలనీవాసులు సీతారాముల వేషధారణలో సీతారాముల ఊరే గింపులో పాల్గొన్నారు. రెడ్డివారి వీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, సుల్తాన్‌పేట ఆంజనేయస్వామి ఆలయం, మండలంలోని తుంపెర ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో వడపప్పు, బెల్లం పానకం పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణులతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాలను ఊరేగించారు.



అనంతపురం : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



గుత్తి : సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



బెళుగుప్ప : సీతారాముల చిత్రపటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పుట్లూరు : ప్రత్యేక అలంకరణలో సీతారాముల విగ్రహాలు

అనంత, నార్పలలో నగదు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం, నార్పల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసులు తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఎలాంటి పత్రాలూ లేకుండా తీసుకెళు_న్న నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నాడు అనంతపురం జిల్లా కేంద్రంలో రూ.9.25 లక్షలు, నార్పలలో రూ.2.84 లక్షలను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురం నగర సమీపంలోని ఎన్‌హెచ్-44 సమీపంలో ఉన్న రవి పెట్రోల్ బంక్ వద్ద సిఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఏపీ 40 బీహెచ్ 3333 నెంబర్ గల కారును తనిఖీ చేయగా అందులో రూ.9.25 లక్షల నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు.

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ బ్రిడ్జి వద్ద బుధవారం నాడు ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ఎఫ్ఎస్‌టి బృందం రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఎటువంటి పత్రాలూ లేకుండా గోపాల్,సాంబశివుడు అనే ఇద్దరు వ్యక్తులు రూ.2,84,800 నగదును తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. నగదుకు సంబంధించి సరైన బిల్లులు, ఆధారాలు చూపితే వెంటనే వారికి అప్పగిస్తామని ఎస్ఐ తెలియజేశారు.



అనంతపురంలో స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

బెదిరింపులపై ఎస్పీకి పాత్రికేయుల ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

పాఠశాలకు సరిగ్గా హాజరు కావడం లేదని వార్తలు రాసినందుకు ఓ విలేకరిని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎపీయూడబ్ల్యూజె, ఏపీయూడబ్ల్యూజె(ఎఫ్) ఆధ్వర్యంలో పాత్రికేయులు ఎస్పీ అమిత్ బర్దర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఓ పత్రికా విలేకరి తాటిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని వార్త రాశాడన్నారు. వార్త రాసినందుకు విలేకరిపై పాఠశాల ఉపాధ్యాయులు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ ఘటనపై విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మార్కండేయులు, షఫీవుల్లా, చౌడప్ప, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ ఆధ్వర్యంలో నవమి వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం కోర్టు రోడ్డు వినాయక గుడి, ఆపస్ కార్యాలయంలో శ్రీరామనవమి వేడుకలను అపస్ జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం యుగయుగాలకు ఆదర్శమైనదన్నారు. విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేయడంతో పాటు జాతీయ భావజాలం, దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర ప్రసాద్, రాజేంద్రప్రసాద్, నారాయణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు హర్షవర్ధన్, రమేష్, జుటూరు రమేష్, వెంకటేష్, ఆదినారాయణ, అదిశేషు, వేణుగోపాల్, ప్రభాకర్, శంకర్ పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ఆర్వో రాణి సుస్మిత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు సంబంధించి నామినేషన్ స్వీకరణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని కళ్యాణదుర్గం ఆర్వో రాణి సుస్మిత తెలియజేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డిఎస్‌పి బి.శ్రీనివాసులతో కలిసి సమీక్ష నిర్వహించారు. గురువారం నాడు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు ఉదయం 11 గంటల నుంచి మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనల మేర దరఖాస్తులను సంపూర్తి చేసి నేరుగానైన లేక ఏజెంట్ ద్వారానైనా సమర్పించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. మూడు గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా దరఖాస్తులు స్వీకరించమన్నారు. సమావేశంలో సిఐలు ఎస్ఐలు ఏఈఆర్వోలు, తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాసం డబ్బులు చెల్లిస్తాం : వీరాంజినేయులు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పామిడి వీరాంజినేయులు

ప్రజాశక్తి-శింగనమల

వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామస్తులకు పునరావాసం డబ్బులు అందిస్తామని శింగనమల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు హామీ ఇచ్చారు. బుధవారం నాడు ఈ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైసిపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రతి పేద కుటుంబానికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాల సాయం అందించిందన్నారు. ప్రజా సంక్షేమం కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి వైసిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఉల్లికళ్ల గ్రామస్తులు సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న పునరావాసం డబ్బులను అధికారంలోకి రాగానే అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సాంబశివారెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్ బొమ్మని శ్రీరాంరెడ్డి, ఉల్లికళ్ల సర్పంచి పరంధామ రెడ్డి, వెంకట నారాయణ, శెట్టిపల్లి నరసింహారెడ్డి, కంచి రెడ్డి భాస్కర్ రెడ్డి, బొమ్మన భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

హిందూపురం : లేపాక్షి మండల పరిధిలో వాహనాల తనఖీలో ఇన్నోవా కారులో కర్నాటక మద్యం తరలిస్తుండగా వాహనంతో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పుట్టపర్తి సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం తెలిపారు. లేపాక్షి నుంచి కంచి సముద్రం బస్సు రహదారిలో గల బయన్నపల్లి క్రాస్ వద్ద అక్రమ మద్యం రవాణా జరుగుతుందనే పక్క సమాచారంతో తనిఖీలు చేపట్టమన్నారు. ఇన్నోవా కారు లో రవాణా చేస్తున్న 30 బాక్సులలో గల 2880 కర్నాటక టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామన్నారు.

మొదటి పేజి తరువాయి

నేటి నుంచి నామినేషన్లు షురూ..!

ఆయా కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను వీరు స్వీకరించనున్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద అధికారులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోని ఆర్ఒ కేంద్రాల వద్ద పోలీసు ఉన్నతాధికారులు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ఆదేశానుసారం బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఆర్ఒ కార్యాలయాల నుంచి 100 మీటర్ల వరకు నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయి. ఆ ప్రాంతంలో స్థానిక పోలీసుతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో పహారా కొనసాగుతూ ఉంటుంది. ఎటువంటి చిన్న అవాంఛనీయ సంఘటనా చోటు చేసుకోకుండా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ఆయా జిల్లాల ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

అన్ని పత్రాలూ సరిగా ఉండాలి..!

అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటనే అధికారులు స్వీకరిస్తారు. అభ్యర్థులు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాల్సి ఉంటుంది. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఒక్క సెకండ్ దాటినా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నామినేషన్లు తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఇక నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్టంగా 3 వాహనాలకు అనుమతి ఉంటుంది. 5 మంది వ్యక్తులు (అభ్యర్థితో సహా) ఆర్ఒ కార్యాలయంలోకి వెళ్లొచ్చు. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లను దాఖలు చేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత అత్యంత పటిష్టంగా పకడ్బందీగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఎక్కువ ద్వారాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో 1571 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1909 బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్ 1909, వీవీ ప్యాట్‌లు ఆయా నియోజకవర్గాలకు అందజేయడం జరిగిందన్నారు. కదిరి నియోజకవర్గానికి సంబంధించి 281 పోలింగ్ కేంద్రాలలో 342 బ్యాలెట్ యూనిట్లు, 342 కంట్రోల్ యూనిట్లు, 396 వివి ప్యాట్‌లు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, డివిజన్ పరిధిలోని ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

లీజు పేరుతో రైతులకు టోకరా..!

మధుసూదన రెడ్డి, సాకే రామమోహన్, సుదర్శన్ రెడ్డిలతో కలిసి ముఠాగా ఏర్పడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని అనేక గ్రామాల రైతుల నుంచి ట్రాక్టర్‌లను లీజుకు తీసుకున్నారు. తీసుకున్న వాటిని కడప, నెల్లూరు, ప్రకాశం, కర్నూల్, నంద్యాల, గుంటూరు జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకే అమ్మేశారు. విక్రయించే సమయంలో మీ పేరు మీద రిజిస్టర్ చేస్తామని వారితో అగ్రిమెంట్ రాయించుకుని, తరువాత రిజిస్టర్ చేయిస్తామని మోసం చేశారు. నిందితులు ట్రాక్టర్లు అమ్మగా వచ్చిన డబ్బులను వాటాలుగా పంచుకుని జల్సాలు చేశారు. ఈ క్రమంలో తన ట్రాక్టర్‌ను లీజుకు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదంటూ ఇటీవల తాడిమర్రి గ్రామానికి చెందిన రైతు దేవర రామమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తు చేస్తుండగా బుధవారం నాడు తాడిమర్రి మండలం దాడితోట చెక్‌పోస్ట్ వద్ద రవికుమార్, బయారెడ్డి, హాజీపీరాలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా ట్రాక్టర్ లీజు బాగోతం బయటపడింది. నిందితుల నుంచి రూ.4.56కోట్లు విలువజేసే 57 ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి ఎస్పీ అభినందన

రైతులకు సంబంధించిన కేసును ఛేదించడంలో కృషి చేసిన ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ రూరల్ సిఐ కష్ణంరాజు నాయక్, తాడిమర్రి ఎస్ఐ ఎం.నాగస్వామి, ఎఎస్ఐలు వన్నప్ప, సూర్యానారాయణ, రాజు, హెడ్‌కానిస్టేబుళు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, కానిస్టేబుళ్లు రమేష్, యాసిన్, అనిల్ తదితరులను ఎస్పీ అభినందించారు.

దళిత ద్రోహి జగన్ : సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైయస్ జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహి అనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో జరిగిన శిరోముండనం కేసులో విశాఖపట్నం కోర్టు వెలువరించిన తీర్పులో వైసిపి నాయకులు తోట త్రిమూర్తులకు శిక్ష విధించిందని అన్నారు. నాడు దళితుడిని చంపిన అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లే చేసి మళ్లీ పార్టీలోకి తెచ్చుకున్నాడని .విమర్శించారు. జగన్ రెడ్డి నడుపుతున్న ప్రభుత్వంలోనే దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయన్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతోమంది దళితబిడ్డలు బలయ్యారని వాపోయారు. ఈ జగన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులపై రోజుకో దాడి జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి అరాచక ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

నేడు నామినేషన్ దాఖలు

పుట్టపర్తి క్రైమ్ : నియోజకవర్గం టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉమ్మడి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని నియోజకవర్గ ప్రజలను తెలుగుదేశం కార్యకర్తలను నాయకులను కోరారు.



పల్లె సింధూరరెడ్డి

కొత్తచెరువు : పుట్టపర్తి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి గురువారం పుట్టపర్తి లోనే ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారనిమండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు తెలిపారు ప్రతి గ్రామానికి వాహనాలను పంపించడం జరుగుతుందని వాటిలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలి రావాలన్నారు. ఉదయం 9:30 గంటలకు కొత్తచెరువు మీదగా పుట్టపర్తి లోనే సత్యమ్మ దేవాలయం దగ్గరకి చేరుకోవడం జరుగుతుందన్నారు. అక్కడ నుండి ర్యాలీగా ఆర్టీవో కార్యాలయానికి తరలి వెళ్లి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు.

అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

జేసీ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ అన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఈమేరకు ఆయన బుధవారం ప్రజాశక్తితో మాట్లాడుతు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గురువారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఆ రోజు నుంచీ నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులతో సహకరించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

కందికుంట సమక్షంలో టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.బుధవారం నల్లచెరువు మండలం కు చెందిన పలువురు నాయకులు యువత కందికుంట సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా కందికుంట మాట్లాడుతూ కదిరి నియోజవర్గంలో వైసీపీకి రోజురోజుకు కోలుకోలేని దెబ్బ తగులుతూనే ఉందన్నారు. యువతను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. ఎన్నికలకు ముందు గంపెడు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. మరోసారి మోసం చేయడానికి ప్రజల్లోకి వస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ కదిరికి చేసింది శూన్యమన్నారు. అనంతరం పార్టీలోకి చేరిన యువత మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ను నమ్మి సర్వం కోల్పోయామని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, గుత్తా ప్రసాద్, అంజినప్ప, గంగులప్పా, సతీష్, చంద్రారెడ్డి, రామ్మోహన తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పరిగి

రాష్ట్రంలో సంక్షేమ పాలన కావాలంటే మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పెనుగొండ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఓటర్లకు పిలుపునిచ్చారు. బుధవారం పరిగి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వైసిపిలో చేరారు. అనంతరం ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచి లక్ష్మీదేవి శివశంకర్, ఎంపిటిసి లింగమ్మ చంద్రశేఖర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీరాములు, ప్రభాకర్, రమణ, సింగారెడ్డి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ :రానున్న ఎన్నికలలో వైసిపికి ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి మక్బూల్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్ ప్రజలను కోరారు. ఈ మేరకు వారు బుధవారం కదిరి పట్టణం 29వ వార్డ్ కౌన్సిలర్ షబ్బీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బైసిపిబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల వెంకటరమణ , ఇస్మాయిల్ ,మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నిసాసాదిక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, శంకర, జిల్లా అధికార ప్రతినిధి వేముల ఫయాజ్, వైసిపి పట్టణ అధ్యక్షులు జిలాన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ హుస్సేన్ పిలుపునిచ్చారు . అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక శాఖ అధికారులు బుధవారం కదిరి ప్రభుత్వ హాస్పిటల్‌లో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాద నివారణకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారి మన్సూర్, అగ్నిమాపక , హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

హిందూపురం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా నగర్, పళని నగర్ ప్రాంతాల్లో గృహాలలో గ్యాస్ వాడకం, లీక్ అయినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గూరించి అగ్నిమాపక అధికారి ప్రభాకర్ మహిళలకు వివరించారు. అనంతరం అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా చూపించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉడాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు నాయక్ తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస అపార్ట్‌మెంట్, సాయి ఋషి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ప్రజలకు అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యుత్, గ్యాస్ ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా చర్యలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎం.నర్సింహులు, రామాంజనేయులు, దేవలానాయక్, వెంకటరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని సంజీవపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని వేల్పుదుడుగు గ్రామానికి చెందిన బోర్ మెకానిక్ అనిల్‌కుమార్, రాప్తాడుకు చెందిన ఇంటర్ విద్యార్థి రాకేష్ రాప్తాడు నుంచి బైకులో బత్తలపల్లికి వచ్చారు. ఆనంతరం తిరిగి రాప్తాడుకు బైకులో వెలుతున్నారు. వీరు మండలంలోని సంజీవపురం గ్రామం వద్దకు చేరగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పి. శ్రీనివాసులు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను తన వాహనంలోనే ఆర్డీటీ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో అనిల్ కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరిక

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువుకు చెందిన పలువురుటిడిపి నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరారు. కొత్తచెరువు నాగేందర్, శ్రీనివాసులు, రామాంజనేయులు, మురళి, రాజు, మస్తాన్ తదితరులకు పార్టీ కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాల్మిన్ సూరి, వాల్మీకి శంకర్, నారాయణ, పెద్దన్న, తిరుపాలు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు

గోనుగుంట్ల అభిమానుల ప్రచారం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని రేగాటిపల్లి చిలకం సూర్యనారాయణ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయనతో పాటు గోనుగుంట్ల అభిమానులు బుధవారం ధర్మవరం మండలంలోని ముచ్చురామి సీతారాం పల్లి, రేగాటిపల్లి తదితర గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు పరమేష్, శేఖర్, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

'కందికుంట'కు మద్దతుగా మైనార్టీల ప్రచారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంటకి మద్దతుగా బుధవారం కదిరి పట్టణంలోని 25 వ వార్డులో మాజీ కౌన్సిలర్ ఖాదర్ భాషా అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో నాయకులు డైమండ్ ఇర్ఫాన్, ఆల్ఫా ముస్తఫా, మహబూబ్ బాషా ,అహ్మద్ భాషా, సిరాజ్ హీదాయత్, రహిమాన్, మున్నా, చాంద్ బాషా, ఇంతియాజ్, మహబూబ్ పీరా, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ప్రజా పార్టీని ఆదరించండి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికల్లో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ హిందూపూర్ ఎంపీ అభ్యర్థి భాస్కర్, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి సురేష్‌ను ఆదరించాలని ఆపార్టీ నాయకులు కోరారు. బుధవారం కదిరి పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభ్యర్థులు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. ఈసందర్భంగా పలువురు ఇండియన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఓటుతో బుద్ధి చెబుదాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వడ్డెర కులస్తులకు ప్రాధాన్యత కల్పించని రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని సామాజిక ఉద్యమ నేత ఎస్ఆర్. ఆంజనేయులు పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ది పొందేందుకు కొందరు వడ్డెర జాతిని రాజకీయ పార్టీలకు తాకట్టు పెడుతున్నారని అలాంటివారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వడ్డెర్లను గుర్తించని రాజకీయ పార్టీలకు వడ్డెర ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పాలని కోరారు.

పల్లె సింధూరను గెలిపించండి

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని కొండకమర్లలో టిడిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ ఈడుగుట్టు ఆంజనేయులు, ఎం నాగేంద్ర నాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాస నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

లేపాక్షి :మండల కేంద్రంలో బుధవారం నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 18మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 60,120రూపాయలు నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని పాతసామలపల్లి శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. వీరి వద్ద నుండి రూ.55,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

జాతీయ విద్యా విధానం రద్దు చేయాలి

ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ

ప్రజాశక్తి అనంతపురం

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం-2020ను రద్దు చేయాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నగరంలోని అనంతపురం ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేట్ ఎదుట ఎఐఎస్ఇసి రూపొందించిన ప్రజా ప్రత్యామ్నాయ విధానం మేనిఫెస్టోను విడుదల చేశారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కె.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బన్న, శ్రీధర్, కమిటీ సభ్యులు కవిత మాట్లాడుతూ విద్యా రంగానికి సంబంధించి ఓ విధానం తీసుకొచ్చేటప్పుడు ఆ రంగంలో నిష్ణాతులైన విద్యావేత్తలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను సంప్రదించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రజా ఉపయోగమైన విధానాలు తీసుకురావాలన్నారు.



ప్రజా ప్రత్యామ్నాయ విధానం మేనిఫెస్టోను విడుదల చేస్తున్న ఎఐఎస్ఇసి సభ్యులు

విద్యార్థులను జ్ఞానవంతులుగా కాకుండా మర మనుషులుగా మార్చే విధానం ప్రజా వ్యతిరేకమైందన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల రాజకీయాలు చేస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా విద్య గురించి ఊసెత్తక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను గ్యారెంటీ చేయాలని, విద్య లక్ష్యాన్ని జ్ఞానంతో పరిపూర్ణమైన మనిషిని రూపొందించే ప్రక్రియగా, సామాజిక బాధ్యత స్పృహ కలిగిన పౌరునిగా మలిచే సాధనంగా నిర్వచించాలని కోరారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్(ఐకెఎస్) పేరుతో బోధిస్తున్న ప్రగతి నిరోధక అశాస్త్రీయ భావాలను పాఠ్యాంశాల నుంచి తొలగించాలన్నారు. నవజాగరణ ఉద్యమ వైతాళికులు, స్వాతంత్ర్య పోరాట యోధుల ఉదాత్త భావనలచే ప్రేరేపితమైన శాస్త్రీయ, ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువలు ప్రాతిపదికగా పాఠ్యప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డా. నగరూరు రసూల్, సహాయ కార్యదర్శి పవన్, కోశాధికారి కె.నాగరాజు, కమిటీ సభ్యులు కవిత, చరణ్ దీప్, విద్యార్థి నాయకులు మహేష్, చరణ్‌రాజ్, భరత్, గణేష్, చరణ్ తేజ్, పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-శింగనమల

ఎన్నికల వేళ ఎంతటి వారైనా చిన్నపాటి గొడవకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ హెచ్చరించారు. ఎస్పీ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి(గురువారం) ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఎక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా అతిక్రమించి గొడవలకు దిగితే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సిఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్, తహశీల్దార్ శోభన్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ ప్రభాకర్‌రావు, అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

రాష్ట్ర విభజన హామీలు సాధించాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన కూడేరు మండలంలోని కమ్మూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను వివరించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడు తూ విభజన హామీలను సాధించడంలో పదేళ్ల పాటు వైసిపి, టిడిపి కాలయాపన చేశాయన్నారు. ప్రత్యేక హోదా సాధించడంలో ప్రాంతీయ పార్టీలు విఫలం చెందాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

20న మందకృష్ణ ధర్మవరం పర్యటన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 20వ తేదీ ధర్మవరం వస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ కోరారు. పట్టణంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో హరిగోపాల్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు 20వ తేదీ మందకృష్ణ ధర్మవరం వస్తున్నారని తెలి పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, నాయకులు గోవిందు, తిప్పేస్వామి, మనోహర్, ఏసుఫ్, వన్నూరప్ప, రామాంజనేయులు, గోపాల్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-వజ్రకరూరు

అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక అధికారి బసవరాజు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉరవకొండలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ, గోదాములో పని చేసే సిబ్బంది, మేనేజ్‌మెంట్ వారికి గ్యాస్ ప్రమాదాలు జరగకుండా, జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


మురిడి గ్రామంలో గ్రామసభ నిర్వహించిన సిఐ ప్రసాద్ బాబు

గొడవలకు దిగితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-డి.హీరేహాల్

సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎక్కడైనా చిన్నపాటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని రాయదుర్గం సిఐ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. సిఐ బుధవారం మండలంలోని మురిడి, గొడిసెలపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికలు దృష్ట్యా ఎక్కడైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును నిర్భయంగా వేయాలని సూచించారు. సిఐతో పాటు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ జిందాల్ కార్మికుడి మృతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన ఖలందర్ గత సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. జిందాల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుడు ఖలందర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా బళ్లారిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజాసాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలి

వ్యకాసం, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఉపాధి హామీ కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ. 600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వ్యవసాయ, సిపిఎం, కార్మిక సంఘాల నాయకులు బుధవారం పెద్దపప్పూరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లి ఉపాధి కూలీలను కలిశారు. ఈ సందర్భంగా కూలీలు వారితో మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామని, షామియానా ఏర్పాటు చేయలేదని, రోజుకు రూ. 200 కూలి కూడా రావటం లేదని వాపోయారు. ఏడాదికి 200 రోజులు పనులు చూపించాలని, వేసవిలో వంద రోజులు పని చూపించి రోజుకు కనీసం రూ. 500 తగ్గకుండా వేతనం ఇవ్వాలని, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. అనంతరం అమ్మలదిన్నె గ్రామంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో సిపిఎం పోరాట ఫలితంగా కూలీలు పెరిగాయని మళ్లీ ఆందోళన చేయడం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం, సిపిఎం నాయకులు

ద్వారా వేతనాన్ని రూ. 600 వరకూ పెంచుకోవాలని అన్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో కూలీలు బతకడం కష్టంగా మారుతుందని, కూలీ వేతనం పెరిగితేనే కొనుగోలు శక్తి పెరిగి జీవనం సాఫీగా సాగుతుందన్నారు. పని దినాలు, కూలి విషయమై ఎంపిడిఒ, ఎపిఒ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని కొన్ని సమస్యల పరిష్కారానికి పోరాటం చేయక తప్పదన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి, బిజెపి కూటమికి కూలీల సమస్యలు పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్ మోహన్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూరి, అమ్మలదిన్నె కుళ్లాయప్ప, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిపై అధిష్టానం పునరాలోచన చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి, పార్టీ కోసం పని చేసే వారికే టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర డెలిగేట్ కమిటీ సభ్యులు కోరి నాగరాజు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే టికెట్‌ను ఇప్పుడు ఎంబి. చిన్నప్పయ్యకు కేటాయించారని, ఇదే వ్యక్తికి 2014, 2019లో కూడా ఇచ్చారని ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే రాయదుర్గంలో కనిపించే చిన్నప్పయ్యకు అధిష్టానం టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తాను కూడా పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేశానని, 8 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో



ఉంటూ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర డెలిగేట్ సభ్యుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర చెప్పకపోయినా, స్థానికంగా అందుబాటులో లేకపోయినా, ప్రజలకు ఏమాత్రం సేవ చేయకపోయినా, కాంగ్రెస్ పెద్దల అండదండలు ఉంటే టికెట్ సంపాదించవచ్చు అనే వ్యక్తికి అధిష్టానం టికెట్ ఇవ్వడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలం పెంచుకోవాలంటే పార్టీ కోసం పని చేసే వారికే టికెట్ ఇవ్వాలని సూచించారు. ఇకనైనా అధిష్టానం పునరాలోచన చేసి పార్టీ కోసం పని చేసే వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరి నాగరాజు విజ్ఞప్తి చేశారు.

అర్హులకు ఎందుకు పథకాలు ఇవ్వలేదు..?

పార్కులు, ఆట స్థలాలు కబ్జా అవుతుంటే కనబడదా.. అర్బన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'సంక్షేమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం అంటూ గొప్పలు చెబుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా వారికి పథకాలు ఎందుకు ఇవ్వలేదు'. అంటూ అనంతపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం నగరంలోని 22వ డివిజన్ ఇన్‌ఛార్జి రాధాదేవి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దగ్గుపాటి ప్రసాద్, అంబికా లక్ష్మినారాయణ హాజరై సూపర్ సిక్స్ ప్యాక్ కరపత్రాలు పంపిణి చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బుడ్డప్ప నగర్ వాసులు దగ్గుపాటి ప్రసాద్‌ని కలిసి కాలనీలలో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ఆట స్థలాలు, పార్కులు తదితర అంశాలపై దగ్గుపాటి దష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తాము నగరాన్ని అంతా చాలాసార్లు చుట్టేసామని కబుర్లు చెప్తున్నారని కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కబ్జా గురైన ఆట స్థలాలు, పార్కులపై విచారణ జరిపిస్తామన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

22వ డివిజన్‌లో వైసీపీకి షాక్

అనంతపురం నగరంలోని 22వ డివిజన్‌లో వైసీపీకి షాక్ తగిలింది. కాలనీలో పలువురు వైఎస్ఆర్‌సిపి నాయకులు 50 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మి నారాయణ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వైసీపీ పాలనపై ప్రజలే కాకుండా సొంత పార్టీ నాయకులు కూడా విసిగిపోయారని, అందుకే తమ పార్టీలోకి వలసలు వస్తున్నాయని తెలిపారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సమచితస్థానం ఉంటుందన్నారు. మాజీ కో ఆప్షన్ మెంబర్, టిడిపి నాయకురాలు షరీనా ఆమె కుమారుడు మైనార్టీ నాయకుడు ఇమ్రాన్‌ను దగ్గుపాటి ప్రసాద్ వారి నివాసంలో కలిసి ఎన్నికల్లో మద్దతు కోరారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలి

రిటర్నింగ్ అధికారి బి.కరుణకుమారి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని రాయదుర్గం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని బి.కరుణ కుమారి ఆదేశించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం లో మాట్లాడా రు. ఈ నెల 18వ తేదీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న సందర్భంగా అదే రోజు నుంచి 25వ తేదీ లోగా(ఆదివారం మినహా) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చన్నారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా 4 సెట్ల నామినే షన్లు వేయవచ్చు అన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. అభ్యర్థి వెంట నలుగురు, లేదా వారి ప్రతినిధితో పాటు ముగ్గురు వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతిస్తారన్నారు. 3



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ కరుణకుమారి

వాహనాలకు కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు, ఫొటో అఫిడవిట్, బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలన్నారు. అభ్యర్థి, వారి కుటుంబ సభ్యుల ఆస్తి, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా, నేరచరిత్ర వివరాలు పేర్కొనాలన్నారు. 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అసంపూర్తి నామినేషన్లను తిరస్కరిస్తారని, ఈ విషయంలో రిటర్నింగ్ అధికారిదే అంతిమ నిర్ణయం అని, కోర్టుకు వెళ్లేందుకు కూడా వీలు ఉండదన్నారు. 29న నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామ న్నారు. అభ్యర్థి ఈ నియోజకవర్గంలో ఓటరుగా లేనిపక్షంలో వారు ఎక్కడైతే ఓటరుగా నమోదయ్యారో అక్కడి నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసే పక్షంలో ఒకరు ప్రతిపాదన చేయాలని, స్వతంత్ర అభ్యర్థులైె పది మంది ప్రతిపాదన చేయాలన్నారు. ప్రతిపాదకులు నియోజక వర్గానికి చెందిన ఓటరు అయి ఉండాలన్నారు. నామినేషన్ వివరాలను ఏ రోజుకా రోజు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులతో సహకరించాలని ఆర్ఓ కోరారు.

జగన్ పాలనలో సంక్షేమ రాజ్యం

'ఇంటింటికీ వైసిపి'లో ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

జగన్ నేతృత్వంలోని వైసిపి పాలన లో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం తెచ్చామని ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి తెలిపారు. నగరంలోని 6వ డివిజన్ పరిధిలో బుధవారం 'ఇంటింటికీ వైసిపి' కార్య క్రమం నిర్వహించారు. ఐదేళ్లలో అనంతపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులతో రూపొం దించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ జగన్ పాలనలో పేదల జీవితాలు బాగు పడ్డాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామ న్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా కుల, మతాలకు అతీతంగా రూ. 2.55 లక్షల కోట్లు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశామ న్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేశామని, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలకు ప్రత్యేకంగా లేఔట్లు వేసి సరసమైన ధరకు



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత

ఇళ్లను అందిస్తున్నామన్నారు. ప్రజలు మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపిని ఆదరించాలని కోరారు. జగన్ సిఎంగా ఉన్నంత వరకూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాగే పరశురాం, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, టిటిడి బోర్డ్ మెంబర్ అశ్వర్థనాయక్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు షర్మిల 'ఆంధ్రా న్యాయ యాత్ర'

జయప్రదం చేయాలని కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్ రెడ్డి పిలుపు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల చేపట్టిన ఆంధ్ర న్యాయయాత్ర విజయవంతం చేద్దామని ఆ పార్టీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం ఉరవకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్ర న్యాయ యాత్ర ఈ నెల 18వ తేదీ మడకశిర, శింగనమల, ఉరవకొండ నియోజకవర్గ కేంద్రాల్లో ఉంటుందన్నారు. షర్మిలతో పాటు సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. పదేళ్లుగా వైసిపి, టిడిపి ప్రభుత్వాలు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశాయన్నారు. కేవలం స్వార్థ రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రజలను



వైసిపి నుంచి కాంగ్రెస్‌పార్టీలోకి చేరిన నాయకులు

మోసం చేస్తున్నారన్నారు. ఆయా ప్రభుత్వాలు కేంద్రంతో పోరాడి ప్రత్యేక హోదా తీసుకురావడంలో, విభజన చట్టాలను అమలు చేయడంలో విఫలం చెంది బిజెపికి తొత్తుగా మారాయన్నారు. నియోజకవర్గంలో సాగునీరు ఇవ్వకుండా రైతులను దగా చేశారని, ముఖ్యంగా ఉరవకొండ పట్టణంలో తాగునీటి సమస్యను గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. కావున షర్మిల ఉరవకొండ పర్యటనలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, సిపిఐ నాయకులు మల్లికార్జున, చెన్నరాయుడు, సుల్తాన్, మనోహర్, కాంగ్రెస్ నాయకులు నిఖిల్‌నాథ్‌రెడ్డి, సోనియా శీన, సుధాకర్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి కాంగ్రెస్‌లో చేరిక

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి, యువజన విభాగం నాయకులు నిఖిల్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాకెట్ల గ్రామానికి పది వైసిపి కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

తోపుదుర్తి శైలజారెడ్డి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం ఎంపిగా బోయను శాంతమ్మ, ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తోపుదుర్తి శైలజారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఆమె బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయితీలోని చిన్మయానగర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట రాప్తాడు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తోపుదుర్తి శైలజారెడ్డి

ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మిసత్యనారాయణరెడ్డి, నాయకురాలు గంగుల భానుమతి, వైస్ ఎంపిపి బోయ రామాంజనే యులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి, వెన్నపూస లోకేశ్వర్‌రెడ్డి, ఉష, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-గుత్తి

శ్రీరామనవమి పండుగ సం దర్భంగా మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలయాదవ్, మాజీ ఛైర్మన్ సి.మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం రాతి దూలం లాగుడు పోటీ లు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో మొత్తం 8 జతల ఎద్దులు పాల్గొనగా గ్రామానికి చెందిన చెవుల చిన్న హనుమంతు ఎద్దులు విజేతగా నిలవగా రూ. 10,016, అలాగే ఎడవల్లి దేవేంద్ర, కోన వెంకటస్వామి ఎద్దులు రెండు, మూడు స్థానాల్లో నిలవగా వారికి రూ. 5,016, రూ. 3,016 నగదు బహుమతులను సి.మల్ల య్యయాదవ్ గ్రామ పెద్దలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు సుంకర సంజప్ప, నెట్టికంటయ్య, చంద్ర, చెట్ల మహేష్, లక్ష్మినారాయణ, కోదండరాముడు, రంగనాథ్, మధు, రాజు, నాగేంద్ర, రామంజి, యాగంటి, ఉపేంద్ర పాల్గొన్నారు.



గుత్తి : విజేత ఎద్దుల యజమానికి నగదు అందజేస్తున్న మల్లయ్య

నార్పలలో ..

నార్పల : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్థానిక సుల్తాన్‌పేటలో రాతిదూలం లాగుడు పోటీ లు నిర్వహించారు. వివిధ ప్రాంతాల రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. పోటీలను తిలకించడానికి నార్పలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నిర్వాహకులు మాట్లాడుతూ పురాతన సంప్రదాయాలు కనుమరుగు కాకూడదనే ఉద్దేశంతో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

నార్పలలో రాతిదూలం లాగుతున్న ఎద్దులు



టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యులు: ఆలం నరసానాయుడు తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని కూరగానిపల్లి గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ఎంపి అభ్యర్థి అంబికా లక్ష్మినారాయణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఈ ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, సిఎం జగన్ అండ్ కో, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు, అవినీతి, దౌర్జన్యాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల ఆంజనేయులు, పిట్టు రంగారెడ్డి, నాగార్జున, అనిల్, రవితేజ, ఎర్రినాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆలం నరసానాయుడు, టిడిపి నాయకులు



రాణినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ఇండియా వేదిక అభ్యర్థికి మద్దతుగా

సిపిఎం ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇండియా వేదిక సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి సి.జాఫర్ నగరంలో బుధవారం నాడు విస్తృత ప్రచారం నిర్వహించారు. రాణి నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు బలపరిచిన ఇండియా వేదిక అభ్యర్థి జాఫర్‌ను గెలిపించాలంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రజలతో ఓట్లు అభ్యర్థించారు. అభ్యర్థి జాఫర్‌తో కలిసి ఇంటింటా తిరిగి ఇండియా వేదిక మ్యానిఫెస్టో అంశాలను వివరించారు. రైతులకు రుణమాఫీ, ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉద్యోగాలు, పరిశ్రమల స్థాపన, విద్యా, వైద్యం ప్రాధాన్యత హామీలను తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్.వి.నాయుడు, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
గురువారం 18 ఏప్రిల్ 2024

ఉద్దండుల నేల... శింగనమల

కమ్యూనిస్టు యోధుల ప్రాతినిధ్యం

అత్యధిక మంది మంత్రులుగా పని చేసిన నియోజకవర్గం

రాజకీయంగా పలువురికి అవకాశం



శింగనమల నియోజకవర్గ కేంద్రం



అనంతపురం జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న శింగమనల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉద్యమాల పురిటిగడ్డగా ఈ ప్రాంతానికి పేరు. రాజకీయ ఉద్దండులు, ఉద్యమ నాయకులు నడయాడిన ప్రాంతం అది. ఉద్యమ నేపథ్యంలో గానీ, రాజకీయ నేపథ్యంలో గానీ అనంతపురం జిల్లా రాజకీయ చిత్ర పటంలో ఈ ప్రాంతానికి ఓ ప్రత్యేకత ఉంది. కమ్యూనిస్టు ఉద్యమ యోధులు తరిమెల నాగిరెడ్డి, మాజీ రాష్ట్రపతి, మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి తదితర ప్రముఖులు ఇక్కడి నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గం నుంచి అత్యధిక మంది మంత్రులుగా పని చేసి గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రజాశక్తి-నార్పల

1952లో పుట్లూరు నియోజకవర్గంలో శింగనమల ఉండేది. 1967లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పుట్లూరు స్థానంలో శింగనమల నియోజకవర్గంగా ఏర్పడింది. శింగనమల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, ఆత్మకూరు, కూడేరు మండలాలతో కలిపి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. 1978లో ఎస్సీ రిజర్వు కేంద్రంగా దీనిని మార్చారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు మండలం రాప్తాడు నియోజక వర్గంలోకి, కూడేరు మండలం ఉరవకొండ నియోజక వర్గంలోకి మార్చబడ్డాయి. వాటి స్థానంలో యల్లనూరు, పుట్లూరు మండలాలు శింగనమలలో కలిశాయి. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 12 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇక్కడి నుంచి గెలుపొందిన రుక్మిణిదేవి, జయరాం, శమంతకమణి, సాకే శైలజానాథ్‌లు మంత్రులుగా పనిచేశారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి శమంతకమణి ఐదుసార్లు పోటీ చేసి 1989లో విజయం సాధించారు. 1985, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగానూ, 2004, 2009లో టిడిపి అభ్యర్థిగానూ ఈమె పోటీ చేశారు. రెండు సార్లు ఎమ్మెల్సీగానూ ఎన్నికయ్యారు. శింగనమల నియోజకవర్గానికి 11 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్, కాంగ్రెస్-ఐ నాలుగుసార్లు, టిడిపి ఐదుసార్లు, జనతాపార్టీ ఒకసారి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకసారి, వైసిపి అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు.



జొన్నలగడ్డల పద్మావతి



శింగనమల చెరువు (ఫైల్‌ఫొటో)

పోరాట యోధుల ప్రాంతం



తరిమెల నాగిరెడ్డి



నీలం సంజీవరెడ్డి

శింగనమల నియోజకవర్గం ప్రముఖుల కేంద్రంగా చెప్పవచ్చు. ఈ నియోజకవర్గం నుంచి అనేక మంది రాజకీయ, కమ్యూనిస్టు నాయకులు వచ్చారు. అప్పట్లో వీరు దేశరాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. వీరిలో నీలంసంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డిలను ప్రముఖంగా చెప్పవచ్చు. నీలం సంజీవరెడ్డి శింగనమల నియోజకవర్గం, గార్లదిన్నె మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో జన్మించారు. గ్రామ స్థాయిలో రాజకీయాలు ప్రారంభించిన ఈయన రాష్ట్రపతి వరకు ఎదిగారు. రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, లోక్‌సభ స్పీకర్‌గా ఈయన పని చేశారు. కర్నూలు జిల్లా నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఈయన అత్యధిక మెజార్టీతో గెలుపొంది ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1953లో ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రిగానూ, 1962లో ముఖ్యమంత్రిగా, 1964లో రాజ్యసభకు ఎంపికై లాల్‌బహుదూర్ శాస్త్రి మంత్రివర్గంలో కేంద్ర ఉక్కుగనుల శాఖా మంత్రిగా పని చేశారు. 1969లో హిందూపురం నియోజవకర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. అప్పట్లో ఆయన లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1977లో ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. తక్కువ వయసులోనే రాష్ట్రపతిగా ఎన్నికైన వ్యక్తిగా నీలం సంజీవరెడ్డికి గుర్తింపు ఉంది. ఇక కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి కూడా శింగనమల నియోజకవర్గానికి చెందిన వ్యక్తే కావడం విశేషం. ఈయన శింగనమల మండల పరిధిలోని తరిమెల గ్రామంలో జన్మించారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనేతగా ఈయన అలుపెరగని పోరాటాలు చేశారు. అనేక సార్లు జైలు జీవితం గడిపారు. ప్రత్యక్ష ఎన్నికల్లో సైతం పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. పుట్లూరు నియోజకవర్గం నుంచి ఒకసారి, అనంతపురం నుంచి రెండు సార్లు గెలుపొందారు. ఈయన ఒక సారి ఎంపీగానూ గెలుపొందారు. అప్పటికే కాంగ్రెస్ దిగ్గజమైన నీలం సంజీవరెడ్డికి రాజకీయంగా గట్టిపోటీని ఇచ్చిన వ్యక్తి తరిమెల నాగిరెడ్డి. ఈ ప్రాంత రాజకీయాల్లో వీరు చెరగని ముద్ర వేసుకున్నారు. వీరి స్ఫూర్తితో అనేక మంది రాజకీయ నేతలుగా, కమ్యూనిస్టు నాయకులుగా ఈ ప్రాంతం నుంచి వచ్చారు.

నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి గెలిచిన, ఓడిన అభ్యర్థుల వివరాలు


సం॥	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1967	చిన్నరంగయ్య శెట్టి	కాంగ్రెస్	కుమ్మెత రంగారెడ్డి	సిపిఎం
1972	తరిమెల రంగారెడ్డి	స్వతంత్ర	తిమ్మారెడ్డి	కాంగ్రెస్
1978	బి.రుక్మిణిదేవి	జనతా	కె.ఆనందరావు	కాంగ్రెస్
1983	గురుమూర్తి	టిడిపి	కె.ఆనందరావు	కాంగ్రెస్
1985	కె. జయరాం	టిడిపి	పి.శమంతకమణి	కాంగ్రెస్
1989	పి.శమంతకమని	కాంగ్రెస్	బిసి.గోవిందప్ప	టిడిపి
1994	కె.జయరాం	టిడిపి	పి.శమంతకమని	కాంగ్రెస్
1999	కె.జయరాం	టిడిపి	సాయిరాం	కాంగ్రెస్
2004	సాకే శైలజానాథ్	కాంగ్రెస్	పి.శమంతకమణి	టిడిపి
2009	సాకే శైలజానాథ్	కాంగ్రెస్	పి.శమంతకమణి	టిడిపి
2014	యామినీబాల	టిడిపి	జొన్నలగడ్డ పద్మావతి	వైసిపి
2019	జొన్నలగడ్డ పద్మావతి	వైసిపి	బండారుశ్రావణిశ్రీ	టిడిపి
పుట్లూరు నియోజకవర్గం పరిధిలో				
1962	టి.నాగిరెడ్డి	సిపిఐ	టిఆర్.రెడ్డి	కాంగ్రెస్
1955	టి.రామచంద్రరెడ్డి	కాంగ్రెస్	టి.నాగిరెడ్డి	సిపిఐ

ఎమ్మెల్యేలుగా నలుగురు మహిళలు ప్రాతినిధ్యం

మంత్రులుగా నలుగురికి అవకాశం



శింగనమల నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేలుగా నలుగురు మహిళలు ప్రాతినిధ్యం వహించారు. నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా కొనసాగారు. తల్లీకూతుళ్ల అయిన శమంతకమణి, యామినీబాల ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా శమంతకమణి టిడిపి అభ్యర్థి బీసీ గోవిందప్పపై విజయం సాధించారు. అప్పట్లో ఆమె రాష్ట్ర మంత్రి వర్గంలో పని చేశారు. ఇక 2014లో ఆమె కూతురు యామినీబాల టిడిపి అభ్యర్థిగా వైసీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతిపై విజయం సాధించారు. ఆమె ప్రభుత్వ విప్‌గా పని చేశారు. 2014లో వైసిపి తరపున ఎమ్మెల్యేగా జొన్నలగడ్డ పద్మావతి ఎంపికయ్యారు. వీరితో పాటు శింగనమల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన రుక్మిణిదేవి, శమంతక మణి, కొత్తపల్లి జయరాం, సాకే శైలజానాథ్‌లు రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు. శమంతకమణి ఓ సారి ఎమ్మెల్యేతో పాటు రెండు సార్లు శాసన మండలికి ఎంపికయ్యారు. ఇక శింగమనల నియోజక వర్గం నుంచి జయరాం మూడు సార్లు, సాకే శైలజానాథ్ రెండు సార్లు విజయం సాధించారు.



నామినేషన్ పత్రం.. జరభద్రం..

ఎన్నికల క్రతువులో అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభం కానుంది. అభ్యర్థుల నుంచి నామినేషన్‌పత్రాలు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సాధారణ రోజుల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈనెల 25 మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26న నామినేషన్లను పరిశీలిస్తారు. 29 వరకు నామినేషన్‌పత్రాలను అభ్యర్థులు ఉపసంహరించుకునే అవకాశముందని ఎన్నికల అధికారులు తెలిపారు. అదేరోజు ఆయా నియోజకవర్గాల్లో ఎంతమంది బరిలో నిలుస్తారనే అంశం తేలుతుంది.

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అర్హతలు..

- నామపత్రాలు దాఖలుచేసే అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు ఉండాలి.
- రాష్ట్రంలోని ఏదేని నియోజకవర్గంలో ఓటుహక్కు
- అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తులు సదరు నియోజ కవర్గానికి చెందిన వారై ఉండాలి.
- జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీచేసేవారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. స్వతంత్ర అభ్యర్థిని పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- ధరవాతు సొమ్ముగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ. 5వేలు, మిగతా అభ్యర్థులు రూ.10వేలను చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సంబంధిత అధికారి నుంచి పొందిన కుల ధ్రువపత్రాలు సమర్పించాలి.
- అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. అందులో నుంచే ఎన్నికలకు ఖర్చు చేయాలి. సంబంధిత వివరాలను ఆర్‌ఒకు సమర్పించాలి.

రిటర్నింగ్ అధికారి నుంచి పొందాల్సిన పత్రాలు

- ఎన్నికల వ్యయాలను నమోదుచేసే రిజిస్టర్
- పరిశీలనకు హాజరయ్యేందుకు నోటీసు
- చెల్లించిన మొత్తానికి రసీదు.
- ప్రమాణం చేసిన ధ్రువీకరణ పత్రం.
- కరపత్రాలు, గోడపత్రికలు తదితర వాటిని ముద్రించేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-127(ఎ) సంబంధిత సూచనల పుస్తకం.
- నామినేషన్లోని లోపాలను జతపర్చాల్సిన పత్రాల సూచిక..



అన్ని కాలమ్స్ పూరించాల్సిందే..

నామినేషన్ అనేది అభ్యర్థి పోటీలో ఉంటారా? లేదా అనే నిర్ణయించే ప్రక్రియ. అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లో అస్తులు, అప్పులు, రాబడి, ఖర్చులు, క్రిమినల్ కేసుల వంటి వివరాలు నమోదు చేయాలి. అడిగిన వివరాలు వర్తించకపోతే "నాట్ ఆప్లికబుల్' అని రాయాలి, అఫిడవిట్లోని కాలమ్స్ అన్నీ తప్పనిసరిగా పూరించాలి. లేనిపక్షంలో సదరు అభ్యర్థికి ఆర్‌ఒ నోటీసులు జారీ చేస్తారు. నామినేషన్ల పరిశీలన తేదీ కంటే ముందుగానే అన్ని కాలమ్స్ పూర్తి చేయిస్తారు. ఖాళీగా ఉంచితే నామినేషన్‌పత్రం తిరస్కరణకు గురవుతుంది.

నేరచరిత్ర చెప్పాల్సిందే..

అఫిడవిట్లో అభ్యర్థి నేర చరిత్రను ప్రస్తావించాల్సి ఉంటుంది. ఫాం- సీ1 ద్వారా రాజకీయ పార్టీలు, ఫాం సీ 2 ద్వారా అభ్యర్థులు వేర్వేరుగా పేరొందిన వార్తపత్రికల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది. స్వతంత్రులైతే వ్యక్తిగతంగా నేరచరిత్రను ప్రకటించాలి. ఇదే ఆఫిడ విట్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో ఉంచుతారు. అందులోని వివరాలు సవ్యంగా లేకపోతే. సదరు అభ్యర్థి ఎన్నికను న్యాయ స్థానంలో సవాలు చేయవచ్చు.

ఎన్నికల నిబంధనలు ఇలా..

- అభ్యర్థి నాలుగు సెట్ల వరకు నామపత్రాలు (ఫా-2బీ) సమర్పించవచ్చు.
దీనికి రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కలిగిన ఫాం- 26 ద్వారా ప్రమాణ పత్రం(అపిడవిట్) జతపర్చాలి.
- అఫిడవిట్‌ను నోటరీ చేయించాలి.
- నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు. స్వతంత్ర అభ్యర్థితో పది మంది వెళ్లవచ్చు.
- నామినేషన్‌పత్రం సమర్పించే సమయంలో అభ్యర్థి ప్రమాణం చేయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌ద్వారా..

ఈసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో నామినేషన్ సమర్పించే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో మొదట 'సువిధ యాప్‌లో ఎన్నికల సంఘం నియమాల ప్రకారం వివరాలు నమోదు చేయాలి. అనంతరం సదరు అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నుంచి అపాయింట్‌మెంట్ తేదీ వస్తుంది. అప్పుడు అభ్యర్థి లేదా ప్రతిపాదించే వ్యక్తులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్‌పత్రాల వివరాలతో కూడిన ధ్రువపత్రాలను అధికారికి అందించాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన బందోబస్తు...

నామినేషన్ స్వీకరణ కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ ర్యాలీలు, వాహనాలను నిలిపివేయాలి. అభ్యర్థితో పాటు మూడు వాహనాలను మాత్రమే కార్యాలయం ప్రాంగణం వరకు అనుమతిస్తారు.

ఇలాగైతే తిరస్కరణే...

నామినేషన్లను తిరస్కరించే అధికారం అధికారులకు ఉంటుంది. నామేషన్‌పత్రాలను సక్రమంగా పూరించక పోయినా, అసంపూర్తి సమాచారమిచ్చినా, సంతకం మారిపోయినా, పార్టీ బీ-ఫాం దక్కకపోయినా తిరస్కరించవచ్చు. గుర్తింపు పొందిన పార్టీ నుంచి అభ్యర్థి నామినేషన్ వేస్తే సదరు పార్టీ బీ-ఫాం ఇవ్వకపోయినా అప్పటికే తనను పది మంది ప్రతిపాదించి ఉంటే ఆయన లేదా ఆమె స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయటానికి అర్హులవుతారు.

19న బాలయ్య నామినేషన్

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 19న బాలకృష్ణ నామినేషన్ వేయనున్న నేపథ్యంలో నియోజక వర్గ వ్యాప్తంగా ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి పిలుపు నిచ్చారు. బుధవారం బాలయ్య నివాసం వద్ద ఉన్న టిడిపి కార్యలయంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శ్రీనివాసులు, డాక్టర్ సురేంద్ర, జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, బిజెపి ఆదర్ష్ కుమార్ మాట్లాడుతు ఉమ్మడి కూటమి అభ్యర్థి నందమూరి బాలకృష్ణ 19వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట లోపు తన నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం నియోజకవర్గం వ్యాప్తంగా ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి రోడ్ షోలో నందమూరి బాలకృష్ణ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కాంగ్రెస్‌పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అలాగే పార్టీ అధిష్టానం ప్రవేశపెట్టిన తొమ్మిది మ్యాన్ పెస్టో పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. వైసిపి, టిడిపిల అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, రైతులు బాగుపడాలన్నా, అన్ని సామాజిక వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఈ విషయాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ కన్వీనర్లతో పాటు కొత్తచెరువుకు చెందిన సనావలి, మైనార్టీ మండల ప్రెసిడెంట్, కొండకమర్లకు చెందిన సీనియర్ నాయకులు బాబు, బద్దేనాయక్ నల్లమాడ, బుక్కపట్నం, పుట్టపర్తి, మండల కన్వీనర్లు గౌస్ బాషా, రవీంద్ర,పొట్ల గంగాధర్, మోహన్, సిపిఎం పట్టణ అధ్యక్షుడు బ్యాల్ల అంజి, కొత్తచెరువు ఎస్సీ సెల్ నాయకులు ఓబులేషు, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీ సత్యసాయి జిల్లా మహిళా ప్రెసిడెంట్ కాజీ షకీరా పాల్గొన్నారు.

బుక్కపట్నం : పేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన 9 పథకాల గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. అనంతరం వైసిపి నాయకులు ఇంద్రజిత్ రెడ్డిని కలిసి మద్దతు కల్పించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు ఓబుళపతి, బుక్కపట్నం, నల్లమాడ మండల కన్వీనర్లు రవికుమార్, గౌస్‌బాషా, సనావుల్లా, శ్రీనివాస్ రెడ్డి, సానే శ్రీధర్ రెడ్డి, ఎర్రగుండ్ల వాసుదేవ రెడ్డి,పెద్దిరెడ్డి సురేంద్ర రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, దావూద్ తదితరులు పాల్గొన్నారు.